క్లుప్తంగా

నేడు గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు

మునగపాక: గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు కార్యక్రమం మునగపాకలో బుధవారం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెంటకోట ఆదినారాయణ, ఆడారి అప్పలనాయుడు, కోశాధికారి పాలిమేర కృష్ణ తెలిపారు. మధ్యాహ్నం 4 గంటల నుంచి ప్రారంభమయ్యే సారె ఊరేగింపు కార్యక్రమం ఇందిరమ్మ కాలనీ, మెయిన్‌రోడ్డు, నందీశ్వర కళా ప్రాంగణం మీదుగా పల్లపు వీధి, సంతబయల, మధ్యవీధి, పంచాయతీ వీధి మీదుగా గౌరీ పరమేశ్వరుని ఆలయానికి చేరుకుంటుందన్నారు. గ్రామపెద్దలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సందడిగా వల్లభేశ్వరస్వామి తీర్థం


హోరా హోరీగా తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెంలో వల్లభేశ్వరస్వామి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాఘపౌర్ణమికి ముందు అమావాస్యకు వల్లభేశ్వరస్వామి తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా గ్రామంలో కబడ్డీ క్రీడా పోటీలు నిర్వహించారు. ఉమ్మడి విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలు నుంచి వచ్చిన కబడ్డీ జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి సముద్ర స్నానాలు ఆచరించి తీరం వద్ద పర్వతంపై వేంచేసియున్న వల్లభేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు.

గ్రంథాలయాల్లో పాఠకుల సంఖ్య పెంచాలి


ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరావు

నక్కపల్లి: గ్రంథాలయాల్లో సభ్యత్వాలను ఎక్కువ చేర్పించి పాఠకుల సంఖ్య పెంచాలని ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరావు తెలిపారు. మంగళవారం ఆయన చినదొడ్డిగొల్లు గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. ఇక్కడ పాఠకుల సంఖ్య, అందుబాటులో ఉన్న పుస్తకాలు, మేగజైన్స్, సెస్సు తదితర విషయాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా సంస్థకి జమ చేయాల్సిన సెస్సు చెల్లించాలన్నారు. గ్రంథాలయం ద్వారా మంచి సేవలు అందించాలని సూచించారు. గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జనార్దన్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన టిప్పర్


ప్రమాద స్థలంలో ఆటో, టిప్పర్

తుమ్మపాల: మండలంలో తుమ్మపాల రోడ్డులో క్వారీ టిప్పర్ల వల్ల ప్రమాదాలు నిత్యం చోటు చేసుకుంటూనే ఉన్నాయి. బండరాళ్లతో ఓవర్ లోడ్ వేసుకుని రోడ్డు మీదుగా తిరుగుతున్న వీటిని చూసి వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. క్వారీ టిప్పర్లకు దూరంగా ఉంటూనే వాహనాలను నడుపుతున్నారు. కాని టిప్పర్ల వేగానికి హద్దు, అదుపు లేకపోవడంతో నిత్యం పలు ఆటోలు, ద్విచక్ర వాహనాలను ఢీకొంటున్నాయి. మంగళవారం తుమ్మపాల పెట్రోల్ బంకు ఎదురుగా ఆగి ఉన్న ఆటోను టిప్పర్ ఢీకొంది. దీంతో ఆటోలో మహిళలు భయందోళనకు గురయ్యారు. ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆటో వెనుక భాగం దెబ్బతింది. ఆటోకు అతి సమీపంలో టిప్పర్ వెళ్లడంతో బాడీ వెనుక డోర్ లాక్ చేసే షీల్ తగిలిందని, వేగం తగ్గించుకోవాలని స్థానికులు టిప్పర్ డ్రైవర్‌కు హెచ్చరించారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాల తో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

సంక్రాంతి వెళ్లినా.. గుంతల రోడ్లే!

రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ● గత ప్రభుత్వంలో 37 కిలోమీటర్ల మేర తారురోడ్లు


రాళ్లు తేలి అధ్వానంగా ఉపమాక జానకయ్యపేట రోడ్డు

నక్కపల్లి: సంక్రాంతికి వచ్చే కొత్త అల్లుళ్ల కోసం కొత్త రోడ్లు ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు పూర్తయింది. సంక్రాంతి పండుగ కూడా వెళ్లిపోయింది. కానీ గుంతలు మాత్రం యధావిధిగానే ఉన్నాయి. రాకపోకలకు ప్రజానీకం ఇబ్బంది పడుతూనే ఉంది. మండలంలో పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్ల పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. రాళ్లు తేలిపోవడం, పెద్దపెద్ద గుంతలు పడటంతో రాకపోకలు సాగించేవారు నానా అవస్థలు పడుతున్నారు. ఉపమాక నుంచి జానకయ్యపేట, పెదతీనార్ల, చినతీనార్ల దొండవాక వెళ్లు రోడ్డు, జాతీయ రహదారి నుంచి దేవవరం వెళ్లు రోడ్డు, గొడిచర్ల నుంచి జగన్నాథపురం వెళ్లు రోడ్డు, ఉద్దండపురం నుంచి గుల్లిపాడు వెళ్లు రోడ్డు, రమణయ్యపేట నుంచి రేబాక వెళ్లు రోడ్డు, జాతీయ రహదారి నుంచి చినదొడ్డిగల్లు వెళ్లు రోడ్డు, జాతీయ రహదారి నుంచి వెదుళ్లపాలెం, సీహెచ్‌బీ అగ్రహారం మీదుగా సీతంపాలెం వెళ్లు రోడ్లు చాలా దారుణంగా ఉన్నాయి. నిత్యం ఈ గ్రామాలకు రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనచోదకులు, ఆటోవాలాలు, పాదచారులు నరకం చూస్తున్నారు. వర్షాకాలం వస్తే మరీ అధ్వానంగా ఉంటున్నాయి. గోతుల్లో నీళ్ల చేరడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఈ రోడ్లు ఎప్పుడో 15 ఏళ్ల క్రితం వేసినవే కావడం ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటం, గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారితో నిత్యం రద్దీగా ఉంటున్నాయి. పాఠశాల బస్సులు, ట్రాక్టర్లు, ఆటోలతో ఈ రోడ్లపై నిరంతరం ప్రయాణాలు సాగిస్తుంటారు. రోడ్లు వేసిన తర్వాత వచ్చిన చిన్నపాటి మరమ్మతులను వెంటనే చేపట్టకపోవడంతో అవి కాస్త పెద్దవి అయి రోడ్డంతా పాడయి గోతులు ఏర్పడుతున్నాయని ఆయా గ్రామాల వారు వాపోతున్నారు.

నిధులు వస్తే పనులు ప్రారంభిస్తాం

ప్రస్తుతం మండలంలో ప్రత్యేక మరమ్మత్తుల కింద రోడ్ల నిర్మాణానికి రూ.4.99కోట్లు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చినరామభద్రపురం, గునిపూడి, ముకుందరాజుపేట, చీడికదోసలపాడు తదితర గ్రామాలకు పక్కా రోడ్లు నిర్మిస్తున్నాం. మిగిలిన రోడ్లకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలయితే పనులు ప్రారంభిస్తాం. – నరేంద్ర, ఏఈ, పీఆర్

మెయింటెనెన్స్ చేయడంలో నిర్లక్ష్యం

ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్‌శాఖ పర్యవేక్షణతో నిర్మించిన ఈ రోడ్లను ఎప్పటికప్పుడు మెయింటెనెన్స్ చేయాల్సి ఉంటుంది. రోడ్డు నిర్మించిన తర్వాత పూర్తిగా శిథిలమయ్యే వరకు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో రూ.11 కోట్లు ఖర్చు చేసి మండలంలో వేంపాడు నుంచి బంగారయ్యపేట (వేంపాడు, నెల్లిపూడి, గునిపూడి) వరకు, నక్కపల్లి నుంచి ఉపమాక మీదుగా రాజయ్యపేట(ఉపమాక, సారిపల్లిపాలెం, అయ్యన్నపాలెం) వరకు, నెల్లిపూడి నుంచి అమలాపురం మీదుగా బోయపాడు వరకు, ఉపమాక నుంచి నర్సాపురం మీదుగా చందనాడ వరకు సుమారు 17 గ్రామాలను కవర్ చేస్తూ 37 కిలోమీటర్ల మేర తారు రోడ్డు సదుపాయం కల్పించారు. దీంతో ఈ గ్రామాల నుంచి జాతీయ రహదారి వరకు రాకపోకలు సాగించేవారికి ఇబ్బందులు తప్పి ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి గతుకుల రోడ్లను బాగుచేయించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల వారు కోరుతున్నారు.


వైఎస్సార్‌సీపీ హయాంలో ఉపమాక నుంచి రాజయ్యపేట వరకు నిర్మించిన తారురోడ్డు

పశు పోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి


రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్


టి.జగ్గంపేటలో పశువులకు చికిత్స చేస్తున్న డాక్టరు బాబూరావు పడాల్

మునగపాక: పశువుల పట్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తద్వారా మెరుగైన పాల దిగుబడులు సొంతం చేసుకోవచ్చని మండల పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ కోరారు. మంగళవారం రాజుపేటలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించి రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో పశువులకు ఎటువంటి వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన పశువులు కొనుగోలు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ కిలాడి దేముడుతో పాటు పలువురు రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలోని సుంకపూరు, టి.జగ్గంపేట గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను మంగళవారం నిర్వహించారు. కె.వెంకటాపురం పశు వైద్యాధికారి డాక్టరు బాబూరావు పడాల్ ఆధ్వర్యంలో టి.జగ్గంపేట శిబిరంలో పశువులకు గర్భకోశ చికిత్స, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు వేశారు. ఆయన మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ద్వారా లింగ నిర్ధారణ వీర్యాన్ని రాయితీపై అందిస్తున్నామన్నారు. పశు సంవర్ధక శాఖ పశు దాణా, గడ్డి కత్తిరింపు యంత్రాలను రాయితీపై అందిస్తున్నారని తెలిపారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గొప్ప దార్శనికుడు

యలమంచిలి రూరల్: సంవిధాన గౌరవ్ దివస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం పట్టణ బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులు భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జాతీయ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజ్యాంగం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు శివ చెప్పారు. అంబేడ్కర్ గొప్ప దార్శనికుడు అన్నారు. రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ పాత్ర, నిబద్ధతను ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వుడా రమేష్, దళిత నేత తెరపల్లి అప్పలరాజు, నియోజకవర్గ కోకన్వీనర్ నక్కా శివశంకర్, జిల్లా ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ పిట్టా దాసుబాబు, జిల్లా మాజీ కార్యదర్శి పప్పు ఈశ్వర్రావు, రాజాన సత్యనారాయణ పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శరవేగంగా రామాలయ నిర్మాణం

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడ ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో స్థానికులు విరాళాలు సేకరించి పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.60 లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వచ్చే నెల 8వ తేదీన భీష్మ ఏకాదశి పర్వదిన సందర్భంగా ఆలయాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మూడు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేద పండితుడు వెలవలపల్లి కోటేశ్వరశర్మ మంత్రోచ్ఛరణల మధ్య ప్రారంభోత్సవం జరిపేందుకు నిర్ణయించారు.


తిమ్మరాజుపేటలో నిర్మిస్తున్న రామాలయం

ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలి



సమావేశానికి హాజరైన ఆటో డ్రైవర్లు, ఇతర వాహనదారులు, మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి: వాహన చోదకులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక వేల్పులవీధి సీతారామ కల్యాణ మండపంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఆటో డ్రైవర్లు, ఇతర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరుగుతుందన్నారు. జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత అనకాపల్లి పట్టణానికి గ్రామీణ ప్రాంతాల నుంచి వాహనదారులు వివిధ పనులపై రాకపోకలు సాగిస్తున్నారన్నారు. అటువంటి వ్యక్తులు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మునగపాక: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

సందడిగా వన సమారాధన


ఆలయ ప్రాంగణంలో అప్పలనరసింహం కుటుంబ సభ్యులు

మునగపాక: మండలంలోని అరబుపాలెంలో ముసిలితల్లి ఆలయ ప్రాంగణం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో అనకాపల్లి విజయరామరాజుపేటకు చెందిన ఆళ్ల అప్పలనరసింహం కుటుంబ సభ్యులంతా వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి ఆటపాటలతో సందడి చేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పెంటకోట రామకృష్ణ, యల్లపు ప్రకాష్, భవాని తదితరులు పాల్గొన్నారు.

వీధులు పరిశుభ్రంగా ఉంచండి


మురుగు కాలువల్లో చెత్త తొలగిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: గ్రామ వీధులు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ కర్రి సత్యనారాయణ కోరారు. తిమ్మాపురం శివారు గోకులపాడు గ్రామంలో సోమ, మంగళవారాల్లో వీధుల్లోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులు చేపట్టారు. ఆరుబయట చెత్తా చెదారాలు పేరుకుపోకుండా ఇళ్లలో చెత్తను ఎప్పటికప్పుడు చెత్తతొట్టెల్లో వేయాలన్నారు. ఇంటిముందు కాలువల్లో చెత్త వేయడం వల్ల మురుగు నిలిచిపోయి దుర్గంధంగా మారుతాయన్నారు. గ్రామంలో కాలువల్లో చెత్త తొలగించి, బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు చెప్పారు.

రథసప్తమి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి: రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణమూర్తి దేవాలయంలో స్వామివారిని మంగళవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 4న రథసప్తమి వేడుకలకు ఆలయానికి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి సుమారుగా లక్ష మంది భక్తులు వస్తారన్నారు. వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యు లు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు, ఎంపీడీవోలకు ఘన సత్కారం


తహసీల్దారు, ఎంపీడీవోలను సన్మానిస్తున్న నాయకులు

నక్కపల్లి: రిపబ్లిక్ డే పురస్కరించుకుని కలెక్టర్ నుంచి ఉత్తమ పురస్కారం అందుకున్న తహసీల్దారు నర్సింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజులను వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో కార్యాలయంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు మనిరాజు, పాపారావు, తదితరులు దుశ్శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. ప్రజా సమస్యలు పరిష్కరంలో విశేషంగా కృషి చేస్తున్న ఇద్దరు అధికారులు మండలంలో పని చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెలగ ఈశ్వరరావు, ఎంపీటీసీ గొర్ల గోవిందు, సర్పంచ్ వెదుళ్ల రమణ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న అన్నదానానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎన్‌జీజీవోస్ కాలనీ దరి శాంతిపురానికి చెందిన కలిదిండి హేమ సాయి రమణ లక్ష్మి అనే దాత రూ.లక్ష 1,116 విరాళాన్ని అందించారు. దేవస్థాన అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ సునీల్ దాతకు బాండ్ ఇచ్చారు.

న్యాయ సహాయకులకు దరఖాస్తులు

నేటితో ముగియనున్న గడువు

యలమంచిలి రూరల్: మండల న్యాయసేవాధికార సంస్థలో సమాంతర న్యాయ సేవ సహాయకులు (పారా లీగల్ వాలంటీర్లు)గా పనిచేయడానికి ఆసక్తి కలిగినవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి. విజయ ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులైన వారు పూర్తి చేసిన దరఖాస్తులతో పాటు తమ ఆధార్, విద్యార్హతల జెరాక్సు కాపీలతో పాటు ఒక స్టాంపు సైజు, పాస్‌పోర్టు ఫొటో ఇవ్వాలన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి కాగా, ఏదైనా సేవా సంస్థలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ఎంపికల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఎటువంటి పారితోషకం ఉండదని, బుధవారంలోగా అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఎంపికైన వారు ఏడాది పాటు ప్రజలకు న్యాయ సలహాలు, సహాయం చేయాలన్నారు.

రాహుల్ గాంధీ నిరసన హాస్యాస్పదం

అచ్యుతాపురం: కేంద్ర ప్రభుత్వం పంచ తీర్థాలను అభివృద్ధి చేయడాన్ని జీర్ణించుకోలేని రాహుల్ గాంధీ తెల్ల టీషర్టు ధరించి నిరసన వ్యక్తం చేయడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభి ప్రసాద్ విమర్శించారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో సంవిధాన్ గౌరవ్ దివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా భరతమాత, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గతంలో బీఆర్ అంబేడ్కర్‌ని అవమానించిందన్నారు. అప్పటి ఎన్నికల్లో సైతం ఓడించిందని విమర్శించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పార్టీ మండలాధ్యక్షుడు కూండ్రపు నాయుడు బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జేవీఎస్ రాజు, రాష్ట్ర సైనిక్ సెల్ కో కన్వీనర్ అగ్గాల హనుమంతరావు, ఓరుపుల జయశంకర్, శీరా చిరంజీవి, మామిడి సురేష్, రాజాన పార్థు, కర్రి వెంకట స్వామినాయుడు పాల్గొన్నారు.


భరతమాత, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

ఉత్తమ ఆర్టీసీ కండక్టర్‌గా సీతారామరాజుకు అవార్డు

మాడుగుల రూరల్ : ఆర్టీసీలో ఉత్తమ సేవలు అందించిన డెక్కల సీతారామరాజుకు రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 26న విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నట్టు సీతారామరాజు మంగళవారం విలేకరులకు తెలిపారు. కె.జె.పురం శివారు తెలకలదీపం గ్రామానికి చెందిన సీతారామరాజు వాల్తేరు డిపోలో పనిచేస్తున్నారు. గతంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రామప్రసాదురెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. తాజాగా రిపబ్లిక్ డే సందర్భంగా అవార్డు అందుకోవడంతో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందిస్తున్నారు.


ఉత్తమ ఆర్టీసి కండక్టరుగా సీతారామరాజుకు ఉత్తమ అవార్డు అందుకుంటున్న దృశ్యం

జోరుగా బడి బయట పిల్లల గుర్తింపు సర్వే

రోలుగుంట : విద్యాశాఖ చేపట్టిన బడి బయట ఉన్న బడి ఈడు పిల్లల సర్వే కార్యక్రమం మండలంలో జోరుగా సాగుతుంది. సీఆర్పీలు చిరంజీవి, నూర్బీ వారి పరిధిలో గల గ్రామాల్లో ఇంటింటా తిరిగి బడి ఈడు పిల్లలను గుర్తించి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. రోలుగుంట క్లస్టర్ సీఆర్పీ పి.సతీష్ కొంతలం గ్రామంలో మంగళవారం ఇంటింటా తిరిగారు. బడిఈడు పిల్లల తల్లిదండ్రులను కలిసి విద్య ప్రాముఖ్యత, ప్రభుత్వ పాఠశాలలో నడుస్తున్న ఇంగ్లిష్, తెలుగు మీడియం బోధన, విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు, ఉచితంగా విద్యార్థులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అందరికీ చదువు.. అందరి బాధ్యత ప్రతి ఒక్కరూ భాగస్వాములై నిరక్షరాస్యుల రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్య పరుస్తున్నారు. ఎంఈవోలు 1, 2 జానుప్రసాద్, పి.జగ్గారావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలను సీఆర్పీలు నిర్వహిస్తున్నారు.